క్లుప్తంగా

రిమ్స్ అన్నపూర్ణకు రూ.10వేలు విరాళం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ సంఘం నిత్యాన్నదాన అన్నప్రసాద వితరణకు సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు విభూతి కుమారస్వామి శుక్రవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. తన అత్తమామలు ఎం.సింహాచలం, జగదాంబ జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షులు గంగుల రమణబాబు, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అభినందనలు చెప్పారు.

జిల్లా జడ్జిని కలిసిన న్యాయ విద్యార్థులు


న్యాయ విద్యార్థులతో న్యాయమూర్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని ఎంపీఆర్ న్యాయ కళాశాల విద్యార్థులు కోర్టు పరిశీలనలో భాగంగా శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానాను న్యాయసదన్‌లో కలిశారు. చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. కోర్టులో కార్యకలాపాలను యువ న్యాయవాదులు వివరించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణ రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎంపీఆర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ మోసే తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సందర్శన

గార: మండలంలోని బూరవిల్లి, అంబళ్లవలస గ్రామాలను బీజేపీ జిల్లా పూర్వ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు సందర్శించారు. పార్టీ ఏర్పడి 45 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గాంవ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బూరవెల్లిలో పాఠశాల, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు. స్థానిక నాయకులతో కలసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పండి యోగీశ్వరరావు, గొలివి కరుణాకరరావు, మళ్ల అబ్బాయినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడేటి శ్రీను, మైలపిల్లి పాపారావు, అప్పారావు, నారాయణ, సూర్యారావు పాల్గొన్నారు.

యంత్రాల పనితీరుపై ఆరా


కోటపాలెంలో వ్యవసాయాధికారుల బృందం

రణస్థలం: గత ప్రభుత్వంలో మంజూరు చేసిన యంత్ర సేవా కేంద్రాలు, యంత్రాల పనితీరును జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు పరిశీలించారు. అల్లివలస, కోటపాలెం, పాతర్లపల్లి పంచాయతీలో యంత్ర సేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు, సీహెచ్‌సీగ్రూప్‌సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహం పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, దళిత సంఘ నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ సాయి ప్రత్యూషలతో కలిసి విగ్రహ పనులను పరిశీలించారు. ఈ నెల 13లోగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నేతలు తైక్వాండో శ్రీను, కంఠ వేణు, రమణ మాదిగ, బోసు మన్మదరావు మాదిగ, మున్సిపల్ కార్పొరేషన్ ఎంఈ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి సత్కారం


ముర్మును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: క్రికెటర్ ధోని అభిమాని, 18 ఏళ్ల యువకుడు సావిక్ ముర్ము కోల్‌కతా నుంచి చెన్నైకు సైకిల్ యాత్ర చేపట్టాడు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లా ఆరామ్‌భాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుర్‌పూర్ గ్రామానికి చెందిన ముర్ము తొమ్మిది రోజులుగా సైకిల్ యాత్ర చేస్తూ శుక్రవారం శ్రీకాకుళం చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, వ్యాపారవేత్త కృష్ణారావులు ముర్మును సత్కరించారు. అనంతరం ముర్ము మాట్లాడుతూ మరో పది రోజులు ప్రయాణం సాగించి చెన్నైలో ధోనిని కలవడమే తన లక్ష్యమని తెలిపాడు.

స్వర సేవకుడి స్మరణలో..!

- నేడు జి.ఆనంద్ విగ్రహ ప్రతిష్ఠాపన
- బాపూజీ కళామందిర్ ఆవరణలో ఘంటసాల, బాలూ విగ్రహాల సరసన స్థానం
- అరసవల్లి ఆదిత్యునికి ఏకాంత సేవ రూపకంతో గుర్తింపు పొందిన ఆనంద్
- దేశ విదేశాల్లో సినీ, భక్తిగీతాల ప్రదర్శనలు


ఆనంద్ విగ్రహం తయారు చేస్తున్న శిల్పి హేమచందర్

నేటి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి

ఘంటసాల, బాలు, జి.ఆనంద్ (జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జి.ఆనంద్ విగ్రహాన్ని నగరానికి చెందిన ప్రముఖ శిల్పి దివిలి హేమచందర్ రూపొందించారు. ఈ విగ్రహాన్ని ఈ నెల 12న బాపూజీ కళా మందిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం మన జిల్లాకు గర్వకారణంగా చెప్పవచ్చు.


జి.ఆనంద్ (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్ : ఒక వేణువు వినిపించెను అనురాగ గీతమై.. **అనే పాట వింటే** మనకు టక్కున **గుర్తు** వచ్చేది **గాయకుడు** గేదెల **ఆనంద్.** జిల్లాలోని **తుల**గాంకు **చెందిన** ఈయన ఇటు సినిమాల్లో గాయకుడిగా.. అటు దేశ విదేశాలలో ఆర్కెస్ట్రా నిర్వాహకుడిగా **జిల్లా** కీర్తిని ఇనుమ**డింపజే**శారు. జిల్లాలోని **తులగాం** గ్రామానికి చెందిన **ఆనంద్ తన విలక్ష**ణమైన గొంతుతో అనేక సినీ గీతాలను ఆలపించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఏకాంత సేవ రూపకం గానం ద్వారా జిల్లాకే వన్నె తెచ్చారు. 1944 ఫిబ్రవరి 16 జన్మించిన ఈయన సంగీత సాగరంలో ఎన్నో మైలురాళ్లను చేరుకుని 2021 మే 6న తుదిశ్వాస విడిచారు. ఆయన జ్ఞాపకార్థం ఈ నెల 12న(శనివారం) జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాల సరసన జి.ఆనంద్ విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేయనున్నారు.

'ఏకాంత సేవ' రూపకం..

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి తన స్వరంతో ఏకాంత సేవ రూపకాన్ని ప్రముఖ సినీ గాయని ఎస్.జానకితో కలసి పాడి అందరికీ సుపరిచితులయ్యారు. ఈ ఏకాంత సేవను భాస్కరభట్ల సీతారామాచార్యులు రచించారు. ఎంతో ప్రాముఖ్యత గల ఏకాంత సేవను తిరిగి ఎలాగైనా నిర్వహించాలనే పట్టుదలతో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి జోగారావు, టి.వి.శివరావుల కృషితో కార్యాచరణలోకి తీసుకొచ్చారు. మొత్తం ప్రక్రియలో దూసిబెనర్జీ, బండారు చిట్టిబాబు, జి.ఆనంద్‌లు ప్రముఖ పాత్ర పోషించారు. వీరు పాడిన ఏకాంత సేవ క్యాసెట్లకు మంచి ఆదరణ లభించింది.

8500 ప్రదర్శనలు..

జి.ఆనంద్‌గా సినిమా గీతాలతో **పాటుగా** స్వరమాధురి ఆర్కెస్ట్రాను **ఏర్పాటు చేసి** దేశ విదేశాలలో 8500 **ప్రదర్శనలిచ్చి ఎంతో** మంది మెప్పుపొందారు. 300 సినిమాలకు పాటలు పాడారు. ఐదు సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. ఓవైపు వీఎల్‌డబ్ల్యూగా ఉద్యోగం చేస్తూనే మరో వైపు సాంఘిక నాటకాల ప్లేబ్యాక్ సింగర్‌గా ఎన్నో పాటలు పాడారు. మొదట్లో ఆనంద్ గళాన్ని మెచ్చుకొని కళా ప్రవీణ బండారు చిట్టిబాబు తన సుకుమార్ ఆర్కెస్ట్రాలో గాయకునిగా రాష్ట్రంలో పలు ప్రాంతాలలో ప్రదర్శనలు ఇప్పించారు.

ఒక వేణువు వినిపించెను పాటతో...

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు జి.కె.వెంకటేష్ సారథ్యంలో నిర్మాణం జరిగిన 'అమెరికా అమ్మాయి' సినిమాలో జి.ఆనంద్‌కు సోలోగా పాడే అవకాశం ఇచ్చారు. 'ఒక వేణువు వినిపించెను' పాటతో సినిమాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తర్వాత అనుకున్నంత స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో సొంతంగా స్వరమాధురి ఆర్కెస్ట్రాను మద్రాసులో స్థాపించి సంగీత గీతాలాపనలు చేశారు. దేశ విదేశాలలో తన ఆర్కెస్ట్రాతో ప్రదర్శనలు ఇచ్చారు. ఎక్కువగా మురళీమోహన్ చిత్రాలకు పాటలు పాడే అవకాశం దక్కింది. సంగీత దర్శకులు చక్రవర్తి, సత్యం, కె.వి.మహదేవన్, మాధవపెద్ది సురేష్ వంటి సంగీత దర్శకుల వద్ద గీతాలను ఆలపించారు. అనేక సీరియల్స్‌కు డబ్బింగ్ ఆర్టిస్టుగా పనిచేశారు. మద్రాసులో ఎ.ఎం.మ్యూజికల్ క్యాసెట్స్ కంపెనీ పెట్టి ఎందరో యువ గాయనీ గాయకులకు ప్రోత్సాహం అందించారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లికి బాగు



ఖరీఫ్ ముందు పచ్చిరొట్ట విత్తనాలతో 25 రకాల విత్తనాలు కలిపి సాగు చేసుకోవడం వల్ల భూమి ఆరోగ్యంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌చార్జి జి.గణమ్మ అన్నారు. శుక్రవారం చల్లపేట రైతు సేవా కేంద్రంలో నవధాన్యాల సాగు, వాటి ప్రాముఖ్యతలపై రైతులకు అవగాహన కల్పించారు.

- గార

దత్తవిజయానంద స్వామి పాదయాత్ర



చిందత్తనాథ క్షేత్రం నుంచి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వరకు ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి శుక్రవారం పాదయాత్రగా తరలివెళ్లారు. దారిలో విజయగణపతి, రమ్యాతిరుమలలోని వేంకటేశ్వర స్వామి, అరసవల్లి కూడలిలో ఏర్పాటు చేసిన సూర్యనారాయణమూర్తి విగ్రహం, యోగాసనాల బొమ్మలను వీక్షించారు.

- శ్రీకాకుళం కల్చరల్

బాటసారులకు బాసటగా..



పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం వద్ద అద్దమణుగుల వెంకన్నపంతులు సత్రం ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఈఓ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీసేందుకు చలివేంద్రాలు ఆసరాగా నిలుస్తాయన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

ఘనంగా అయ్యప్ప జన్మనక్షత్ర పూజలు


బలగలో అయ్యప్పస్వామికి అలంకరణ


పాత శ్రీకాకుళంలో అభిషేక అలంకరణ


గూడెంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి ఆలయంలో జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకర నారాయణ శర్మ, మణిదీపక్, కిరణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అష్టాభిషేక అర్చనలు, మణిమయ మకుటాభరణ అలంకరణ, విశేష నివేదనలు, దివ్య దీపాలంకరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు, భక్తులు పాల్గొన్నారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయంలో అయ్యప్ప జయంతిని సందర్భంగా సుప్రభాతసేవ, అష్ట ద్రవ్యాలతో అభిషేకం, అలంకరణ, కర్పూర హారతి ఇచ్చారు. సాయంత్రం పాపారావు గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ, భజనలు జరిగాయి. కార్యక్రమంలో అర్చకులు ఎం.బాలభాస్కరశర్మ, ఊన్న సర్వేశ్వరరావు, వరాహస్వామి, నందికేశ్వరరావు, శంకర్, దానయ్య పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గూడేం గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్ప జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామ పురోహితులు పెంటా కిరణ్‌కుమార్ శర్మ, దుండు చిట్టిబాబు గురుస్వాములు ఆధ్వర్యంలో 18 మంది దంపతుల సమక్షంలో విశేష పూజలు నిర్వహించారు.

రైతుమిత్ర గ్రూప్‌కు యంత్రాల పంపిణీ


రైతులకు యంత్రాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: చింతాడ గ్రామంలో కమ్యూనిటీ హైరింగ్ కేంద్రం, శ్రీరామా రైతు మిత్ర గ్రూప్‌కు శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి ఆధ్వర్యంలో సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్


జె.ఆర్.పురం సచివాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రణస్థలం: సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఉత్సాహవంతులైన ఆదర్శ పాఠశాల విద్యార్థులకు జె.ఆర్.పురం, పైడిభీమవరం గ్రామ సచివాలయాల్లో 10 రోజుల ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఐటీ, ఆన్‌లైన్, సాంకేతిక అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగం ట్రైనర్ రత్నబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి అభిషేకాలు



మండలం కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో శుక్రవారం అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) 90వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం నాయకులు తోనంగి నందోడు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1936లో బ్రిటీష్ పాలనకు, భూస్వాములకు వ్యతిరేకంగా ఏఐకేఎస్ ఏర్పడిందని చెప్పారు. రైతులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని దుయ్యబట్టారు. రైతుల తరఫున పోరాటం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పన్న, రాజేశ్వరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో శుక్రవారం యాన్యువల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ కళాశాల విశిష్టతను, సాధించిన ప్రగతిని, ఫలితాలను వివరించారు. జేడీ, చీఫ్ ప్లానింగ్ అధికారి వీఎస్ఎస్ఎ ప్రసన్న తదితరులు మాట్లాడుతూ విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, సీహెచ్ కృష్ణారావు, ఎస్.పద్మావతి, టి.ఆదిలక్ష్మి, కనకదుర్గ, జ్యోతిలక్ష్మి, స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు ఆర్.కావ్యాంజలి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 1/2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రెండో రోజూ ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జోనల్ చీఫ్ అడ్వైజర్ కె.వి.ఆర్.కుమార్, రీజనల్ అధ్యక్షుడు రామకృష్ణారావు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు, అక్రమ తొలగింపులు వెంటనే ఆపాలన్నారు. పదోన్నతులు కల్పించి గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎన్ఎంయూ ఒకటి, రెండు డిపోల కార్యదర్శులు ఎంఎస్ రావు, పి.నవీన్‌బాబు, నాయకులు వీడీ రావు, రాజారావు, పి.చంద్రకళ, కె.శ్రీదేవి, ఎ.కళ్యాణి, పి.భాగ్యలక్ష్మి, ఎం.భారతి, ఎస్.సూర్యలక్ష్మి, పీఎస్ దేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లోనూ పన్నుల స్వీకరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరపాలక సంస్థ పరిధిలో గృహ యజమానులు, వాణిజ్య సముదాయ యజమానులు 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలు, కుళాయి పన్ను బకాయిలు, ఖాళీ జాగా పన్ను బకాయిలను అన్ని సెలవు దినాల్లోనూ చెల్లించవచ్చని కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, రెండో శనివారం, ఆదివారాల్లోనూ పన్నుల స్వీకరణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేక విద్య


మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రత్యేక అవసరాల పిల్లలకు వారికి అనువైన పద్ధతుల్లో బోధించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని అన్నారు. శుక్రవారం సంఘటిత విద్య అనే అంశంపై భారత పునరావాస మండలి, వర్సిటీ సంయుక్తంగా వర్సిటీలో మూడు రోజుల సదస్సు ప్రారంభించారు.

ఈ సందర్భంగా సికింద్రాబాద్‌కు చెందిన జాతీయ మేధో దివ్యాంగుల సాధికార సంస్థ అధ్యాపకురాలు డాక్టర్ కూన లలితకుమారి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో తీసుకొచ్చిన నాలుగు దశల విద్యలో దివ్యాంగులకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. వారిలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ హెచ్.సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారి ఎస్.శశిభూషణ్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం


మాట్లాడుతున్న లక్కీ వర్మ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకమని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్సు చీఫ్ లక్కీ వర్మ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుతం పారిశ్రామిక రంగంలో వస్తున్న మా ర్పులను గమనిస్తుండాలన్నారు. కార్యక్రమంలో వీసీ రజిని, అధికారులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి కష్టపడి పనిచేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా శుక్రవారం పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కళింగకుల కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు


శ్రీకాకుళం పీఎన్ కాలనీజీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


శ్రీకాకుళం క్రైమ్: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


ఎచ్చెర్ల క్యాంపస్: పూలేకు నివాళులు అర్పిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, అధికారులు


రణస్థలం: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్

వారసత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు


తహశీల్దార్ కార్యాలయం వద్ద యర్రయ్య కుటుంబ సభ్యులు

గార: పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు, ప్రభుత్వం స్పందించి మా భూమిని అప్పగించకపోతే ఆత్మహత్యే శరణ్యమని బాధితులు అధికారులను ఆశ్రయించారు. శాలిహుండం రెవెన్యూ పరిధి బోరవానిపేటలో సర్వే నెంబరు 335లో 1లో ఏడు సెంట్లు స్థలం బోర యర్రయ్యకు సంక్రమించింది. అందులో డాబా ఇల్లు నిర్మించుకొని, మిగతా స్థలం ఖాళీగా ఉంచారు. అదే గ్రామానికి చెందిన బగ్గు దశరత్నం భర్త ఆదినారాయణ సదరు స్థలాన్ని ఆక్రమించారని యర్రయ్య కుటుంబ సభ్యులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణ అడ్డుకోవాలని కోరారు.. ఈ విషయమై వీఆర్వో సునీల్ వద్ద ప్రస్తావించగా దశరత్నం కుటుంబ సభ్యులు స్థలపరిశీలన చేసి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరడంతో వెళ్లి పరిశీలించామని, ఉన్నతాధికారులకు రిపోర్టు పంపిస్తామన్నారు.